
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 86 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 10, ధధీచి, వజ్రాయుధం

దేవతలు వృత్రాసురుడి మీద భయంతో వైకుంఠానికి వెళ్ళి నారాయణుణ్ణి శరణువేడారు తమకి ఆయనే దిక్కు అని. ఆయన కనిపించి దేవతలకి ఇప్పుడు చేయాల్సిన పని చెప్తున్నాడు. ఈ చెప్పడంలో కొంత వేదాంత తత్వం ఉంది సరిగ్గా గమనించండి.

వ. మఱియును, బ్రీతుండనైన నాయందు భక్తులకుం బొందరాని యర్థంబు లేదు, విశేషించి నాయందునేకాంతమతి యైన తత్త్వవిదుం దన్యంబులం గోరకుండు; గుణంబుల యందుఁ దత్త్వజ్ఞానగోచరుం డైన వాఁడు విషయనివృత్తచిత్తుండై సంసార మార్గంబు నిచ్ఛింపడు; కావున మీకు శుభం బయ్యెడు; దధీచియను ఋషి సత్తముండు గలం డతని శరీరంబు మద్విద్యాతిశయ మహత్త్వంబునను దేజోవిశేషంబు నను సారవంతంబై యున్నయది; నతని నడిగి, తచ్ఛరీరంబుఁ బుచ్చికొనుండు; అతండు పూర్వకాలంబున యశ్వినీదేవతలకు నశ్వశిరోనామం బను బ్రహ్మస్వరూపం బగు నిష్కళంకం బయిన విద్య యుపదేశించిన; వారలు జీవన్ముక్తిత్త్వంబు నొందిరి మఱియు త్వష్టృ పుత్రుండయిన విశ్వరూపునకు మదాత్మకం బయిన యభేద్య కవచంబు నిచ్చెఁ; గావున నతం డతివదాన్యుండు; దేహంబు వంచింపక మీకిచ్చు; నతని శల్యంబులు విశ్వకర్మ నిర్మితంబు లై, శతధారలు గల యాయుధ శ్రేష్ఠంబయి, మత్తేజోపబృంహితం బయి వృత్రాసుర శిరోహరణ కారణం బయి యుండు; దానం జేసి మీరు పునర్లబ్ధ తేజోస్త్రాయుధ సంపదలు గలిగి వెలింగెదరు; విశేషించియు మద్భక్తవరులైన వార లే లోకంబుల నెవ్వరికి నజయ్యులు; కావున మీకు భద్రం బయ్యెడు" మని భూతభావనుం డైన భగవంతుం డదృశ్యం డయ్యె; నప్పుడు దేవతలు దధీచిముని కడకుం జనిరి; అత్తఱి నింద్రుం డిట్లనియె.

[6-347]

నన్ను శరణు జొచ్చినవారికి దుర్లభమైనదేదీ లేదు. విశేషంగా చెప్పాలంటే, తత్వవిదుడైనవాడు ఏదీ కోరడు నన్ను తప్ప. అటువంటివాడు విషయవాంఛలని, సంసార మార్గం వదిలేసి నన్నే కోరుతాడు. దేవతలు కూడా ఏవో కోరికలతో వచ్చినవారే కదా, అందుకే వాళ్లకి కూడా చెప్తున్నాడు, నన్నే కోరుకునేవాడికి సంసారం అక్కర్లేదు సుమా, ఈ వేదాంతం జీర్ణించుకోండి అని. దేవతలు అంటే కొంతకాలం తర్వాత ఆ దేవతాస్వరూపం చాలించి మరో మెట్టు పైకో కిందకో వెళ్ళాలి. వాళ్ళు కూడా భగవంతుణ్ణి పూర్తిగా తెలుసుకోనివారే. ఎవరైతే పూర్తిగా భగవంతుణ్ణి తెలుసుకుంటారో వాళ్ళకి అహంకార మమకారాలు అన్నీ నశించి త్రిగుణాతీతులై ఆయనలో కలవడం అనేదే బ్రహ్మజ్ఞానం అంటే. దీన్నే రామకృష్ణులు అనడం ప్రకారం, ఉప్పుబొమ్మ సముద్రం లోతు కొలవడం వంటిది. బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి అనే ఉపనిషద్వ్యాక్యం చెప్పేది ఇదే కూడా. ఇంత చెప్పాక ముందు చేయాల్సిన పని ఏమంటే ధధీచి అనే ముని ఒకాయన ఉన్నాడు. నన్నే కోరుకుంటూ తపస్సు చేసే ఆ ముని శరీరం నారాయణ కవచ ప్రభావం వల్ల సారవంతమై ఉంది. పూర్వం అశ్వినీ దేవతలకి ఆశ్వశిరం అనే విద్యని ఇచ్చాడు. దానివల్ల వాళ్ళు జీవన్ముక్తులయ్యారు. ఆ ధధీచి త్వష్ట ప్రజాపతికీ ఆ ప్రజాపతి తన కొడుకైన విశ్వరూపుడికీ ఈ

నారాయణ కవచం ఇచ్చారు. ఆయన పెద్ద దాత (వదాన్యుండు). వెళ్ళి ఆయన దేహాన్ని మీరు అడగండి. వాటి అస్థికలతో విశ్వకర్మ నూరు అంచులు గల ఆయుధాల్లో శ్రేష్టమైన వజ్రాయుధాన్ని (శతధారలు గల యాయుధ శ్రేష్ఠంబయి) తయారు చేస్తాడు. దానితోనే వృత్రాసురిడి మరణం సంభవం. అలా అనేసరికి ఇంద్రుడు ఆశ్వినీ దేవతలను వెంట ఉంచుకుని ధధీచి దగ్గిరకి వచ్చాడు.

ఉ. ఎక్కడ నెల్ల లోకముల నెవ్వరు గోరని కోర్కి, నేఁడు మా
తెక్కలిపాటునన్ దివిరి దేహము వేఁడగ వచ్చినార; మే
మెక్కడ? తీవ్ర కర్మగతి యెక్కడ? దైవకృతంబు గాక; యీ
రొక్కపు దాన మీ వరుస రోయక వేఁడుదురే జగంబులన్? [6-349]

ఏనాడూ ఎవరూ అడగని కోరిక ఇది. అయినా మేము, దేవతలమై ఉండీ నీ దేహం ఇవ్వమని అడగడానికి వచ్చాం. ఇంతటి నీచానికి దిగజారామంటే విధి వైపరీత్యం (దైవ కృతంబు) కాక ఇంకేమనాలో? లేకపోతే దేవతలమైన మేము ఇటువంటి ఒత్తిడి (రొక్కపు) చేసే దానం ఎలా అడగలసి వచ్చిందో?

తే. సర్వ భూతదయాపర స్వాంతులకును
బుణ్యవర్తను లగు మిమ్ముబోఁటి వారి
కమిత సత్కీర్తి కాముల కలఘుమతుల
కియ్యరాని పదార్థంబు లెవ్వి గలవు? [6-357]

అదీగాక మీరు సర్వభూత దయాపరులు, బుణ్యవర్తనులు. అందువల్ల మీకు ఇవ్వకూడని పదార్థాలంటూ ఏమీ లేవు. ఏది అడిగినా ఇవ్వగలరు. అయితే మా విషయం చూస్తే మరోలా ఉంది.

ఆ. అడుగరాని సొమ్ము నడుగ రాదని మానఁ
దడుగువాని మాట లడుగ నేల?
బ్రాంతి నడుగుచోటఁ బ్రాణంబు లేనియు
నిచ్చువాఁడు దాఁపఁ డిచ్చుఁ గాని. [6-358]

అడగరానిది అని తెల్సి ఉండీ అడుగుతున్నాం. అడుక్కునేవాడు దాత ఏది ఇవ్వగలడు, ఇవ్వలేడూ అని చూసుకోకుండా అడిగేస్తాడు. ఎందుకంటే వాడు అడుక్కోవడానికి వచ్చినవాడు కదా? ఇటు దాత వైపు నుంచి చూస్తే ఆయన ఎంతటి దానినైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాడు. ఎవరినా ఆశపడి ప్రాణాలు అడిగినా ఇవ్వడానికి దాత సిద్ధమే. అందువల్ల ఇలా వచ్చాం.

ఈ దానం, అభ్యర్ధన విషయం చూస్తే కర్ణుడు గుర్తుకురాక మానదు. “రేపు పొద్దున్నే ఇంద్రుడు నీ దగ్గరకి వచ్చి కవచ కుండలాలు ఇవ్వమని అడుగుతాడు, ఇవ్వకు, అవి ఇస్తే నీ ప్రాణం మీదకి వస్తుంది” అని సూర్యుడు అంటే ఏమంటాడు కర్ణుడు? “ప్రాణం పోనీయ్ గాక ఎవరేమి అడిగినా ఇస్తానని చెప్పిన మాట తప్పుతానా? ఇచ్చి తీరుతాను. అందులోనూ అడిగేది ఇంద్రుడైతే ఇవ్వను అని ఎలా అనమంటావు?” పరోక్షంగా కర్ణుడు– ఇచ్చే దాత మనసు, ఎలా ఉండాలో చెప్పకనే చెప్తున్నాడు కదా? మరోసారి, ఇంతకు ముందు చెప్పుకున్నదే అయినా చిన్న కథ చెప్పుకుందాం.

కర్ణుణ్ణి దానం అడగడానికి ఏ రోజు, ఏ గంటలోనైనా ఎవరైనాసరే వచ్చి ఏమి కావాల్సినా అడగడానికి వీలు ఉండేదిట. ఓ రోజు స్నానం చేయడానికి ఎడమ చేతిలో బంగారు గిన్నె పట్టుకుని అందులో ఉన్న నూనె కుడిచేత్తో తీసి వంటికి రాసుకుంటున్నాడు. ఈ స్థితిలో ఒకాయన వచ్చి అభ్యర్ధించాడు ఏదైనా ఇవ్వమని. కర్ణుడు తన ఎడమ చేతిలో ఉన్న గిన్నె అలాగే అదే చేత్తో ఇచ్చేసాడు తీసుకోమంటూ. తీసుకునే ఆయన అన్నాట్ట, 'దానం అలా ఎడమచేత్తో ఇవ్వకూడదండి, కుడిచేత్తోనే ఇవ్వాలి' అని. దానికి కర్ణుడు సమాధానం చెప్పాడుట ఇలాగ. 'అలా కుడి చేత్తోనే ఇవ్వాలి అనడం తప్పు. ఎందుకంటే ఆ గిన్నె ఎడమ చేతిలోంచి కుడిచేతిలోకి మారేలోపు నా మనసు మారిపోయి నీకు మరొకటేదో ఇవ్వాలని నాకు అనిపించవచ్చు కదా? అందువల్ల ఎప్పుడు ఏది ఇవ్వాలని ఉంటే అది వెంఠనే ఇచ్చేయాలి.' మనకి ఇది సర్వసాధారణంగా జీవితంలో గ్రహింపుకి వచ్చిన సందర్భాలు ఉండవచ్చు కూడా. ఎవరో డబ్బులు అడిగారు. మీరు ఓ అయిదు వేలు ఇద్దామనుకున్నారు. కానీ ఏదో కారణం వల్ల రెండురోజులు ఆలస్యం అయింది ఇవ్వడానికి. ఈ లోపున అయిదువేలు ఎందుకులే, మూడు చాలవా అనిపించి మూడువేలే ఇచ్చారు. అదీ రెండు రోజుల్లో మార్పు.

రెండు రోజుల వరకూ ఎందుగ్గానీ మీరు రోడ్డుమీద ముష్టివాణ్ణి చూసి పది రూపాయలు ఇద్దామనుకున్నారు. కానీ జేబులోంచి తీసిన డబ్బుల్లో ఒక ఐదు రూపాయిల కాయితం, పది కాయితం కనిపించాయి. వెంఠనే మనసు మారిపోయి, "ఆ! వీడికి ఐదు చాలదా?" అనిపించి ఆ కాయితమే ఇచ్చారు. కర్ణుడు చెప్పిన విషయం సరిగ్గా ఇదే. మనసు మారడానికి ఆ ఒక్క క్షణం చాలు. గిన్నె కుడిచేతిలోకి వచ్చేసరికి మనసు మారవచ్చు అందువల్ల ఆ చేత్తో ఇచ్చేసాడు. ఇచ్చేటపుడు మనసు ఎలా ఉందనేది ముఖ్యం గానీ ఏ చేత్తో ఇస్తున్నాం అనేది ఎన్నడూ ముఖ్యం కాదు. బలి చక్రవర్తి కూడా ఇదే విధంగా చెప్తాడు "వచ్చిన వాడు శ్రీహరి దానం ఇవ్వకు" అనే శుక్రాచార్యుడితో. "నిరయంబైన, నిబంధమైన, ధరణీ నిర్మూలంబైన... ఇచ్చి తీరుతాను" అంటూ. దానం ఇచ్చే వీళ్ళు అడిగే ప్రశ్న ఏమిటంటే, "శ్రీహరి/ఇంద్రుడు అంతటివాడు దేహీ అని వస్తే లేదు అని ఎలా చెప్పమంటావయ్యా?" బాగుంది కదా?

వ. అని పరసంకటంబు దలంపక నిలింపులు గార్యపరతన్ సవినయ వాక్యపరంపరలఁ బ్రార్థించిన, నతండు దరహసితవదనుండై, యఖిల లోకధర్మం బెఱింగియు నొక్కింత కాలంబు ప్రతివాక్యం బిచ్చితి; దీని సహింపదగుదురు; మీయట్టి వారలకుం బ్రియం బగునేని నెప్పుడైన విడువందగిన శరీరంబు విడుచుట యేమి దుర్లభంబు? నధ్రువం బైన యీ దేహంబుచేతం గీర్తి సుకృతంబుల నెవ్వం డార్జింపకుండు నతండు పాషాణాదులకంటె నతి కఠినుండు; మీయట్టి పుణ్యశ్లోకులచేతఁ గాంక్షింపబడిన శరీరం బప్రమేయ ధర్మార్జితంబు; ఏ దేహంబుచేత సకల భూతంబులు శోకానుభవంబున శోకించు; హర్షానుభవంబున హర్షించునట్టి మహాకష్ట దైన్యాకరం బైన శరీరంబు కాక శునక సృగాలాదుల పాలు గాకుండ మేలయ్యె; నని నిశ్చితాత్ముం డయి దధీచి దత్త్వాలోకనంబుచేత నిరసిత బంధనుండై, బుద్ధీంద్రియ మానసంబు లతోఁ గూడిన క్షేత్రజ్ఞునిఁ బరబ్రహ్మస్వరూపంబైన భగవంతు నందు నేకీభూతంబు చేసి, యోగజ్ఞానంబున శరీరంబు విడిచె; అప్పుడింద్రుం డతని శల్యంబుల విశ్వకర్మ నిర్మితం బైన, నిశిత శతధారా సమావృతంబై వెలుంగు వజ్రాయుధంబుఁ గైకొని, భగవత్తేజోపబృంహితుం డై, యైరావతారూఢుండై, సకల దేవోత్తమ గరుడ గంధర్వ ఖచర కిన్నర కింపురుష సిద్ధ విద్యాధర పరిసేవితు డై సకల ముని జనంబులు వినుతింపఁ ద్రిలోక హర్షకారియై, భగవదనుగ్రహ సంప్రాప్త మహోత్సాహ వికసిత వదనారవిందుండై వృత్రాసురుపై నడచె; నప్పుడు. [6-359]

ఇలా అడిగిన దేవతలకి ధధీచి ఏమి చెప్తున్నాడంటే – "ఏదో ఒకరోజు ఈ శరీరం విడవాలి. మీవంటి వారికి ఉపయోగపడుతుందంటే ఈ శరీరం విడవడం ఏమీ కష్టం కాదు. ఈ దేహం ఇవ్వడం వల్ల కీర్తి, పుణ్యం వస్తున్నాయంటే దాన్ని ఇవ్వనివాడు రాయి కంటే కఠినాత్ముడై ఉండాలి. మామూలుగా ప్రాణం పోయినప్పుడు ఈ శరీరం కాకులకీ గ్రద్దలకీ నక్కలకీ ఆహారం అవుతుంది. అలా కాకుండా మీవంటి పుణ్యాత్ములకి పనికి వస్తుందంటే మేలే కదా? అందువల్ల తప్పకుండా తీసుకోండి." అలా అని పరబ్రహ్మంమీద మనస్సు కేంద్రీకరించి యోగమార్గంలో దేహం విడిచేసాడు. ఆ దేహాన్ని తీసుకుని విశ్వకర్మ వజ్రాయుధం తయారు చేసాడు. దాన్ని పట్టుకుని ఇంద్రుడు ఐరావతం మిద ఎక్కి వృత్రాసురుడి మీదకి యుద్ధానికి మహోత్సాహంతో బయల్దేరాడు మరోసారి. గమనించారా, త్వష్ట ప్రజాపతికి నారాయణ కవచం ఇచ్చిన ధధీఛి మహర్షే తన ఎముకలు ఇచ్చాడు వజ్రాయుధాన్ని తయారు చేయడానికి ఇచ్చాడు. అందుకే భగవద్గీతలో కృష్ణుడు "ఆయుధానామహం వజ్రం ..." (భ. గీ. 10.28) అని అర్జునుడితో చెప్తాడు.

ఉ. వృత్రుఁడు దాన వాన్వయ పవిత్రుఁడు లోకజిఘాంసకక్రియా
సూత్రుఁడు నిగ్రహాగ్రహణ సుస్థిర వాక్య వివేక మాన చా
రిత్రుఁడు దేవతోరగ దరీకృత వక్త్రుఁడు రోష దూషితా
మిత్రుఁడు శత్రురాకఁ గని మిక్కలియైన యుగాంతకాకృతిన్. [6-360]

ఇలా దేవతలు వజ్రాయుధంతో వస్తున్నారని వృత్రుడికి తెల్సింది. తానూ యుగాంతకృతి తో (అంటే ప్రాణాలు తీసే యముడిలాగా) బయల్దేరాడు. ఈ పద్యం నాలుగు పాదాల్లో మొదటి పదం గమనించారా వృత్రుడు, సూత్రుడు, చారిత్రుడు, మిత్రుడు. పోతన రాసినట్టే ఉంది కదా పద్యం? పోతన ఇది చూసి ఉంటే, నా కన్నా బాగారాసావు అని సింగయ గార్ని మెచ్చుకుని ఉండేవాడేమో.

క. మెండు గల దనుజ నాయక
మండలములు గొల్వ నడచె మహితోద్ధతి వే
దండముల నడుమ జను నడ
గొండయునుం బోలె నిబిడ గోపోద్ధతుఁడై. [6-361]

అనేకమంది రాక్షస నాయకులు కూడా వస్తుంటే, ఏనుగుల మధ్య వచ్చే కొండలాగా (దండముల నడుమ జను నడగొండయునుం బోలె) కోపంగా వచ్చాడు దేవతలమీదకి.

క. కాలగళుఁ డడిరి కదువడిఁ
గాలునిపైఁ గవయు మాడ్కి ఖరతర రవ సం
చాలిత పూర్వ దిగంతరుఁ
డై లీల మహేంద్రుమీఁద నతఁ డరిగె నృపా! [6-362]

అలా వచ్చిన వృత్రుడు దేవతలమీద ఎలా దాడి చేసాడంటే, శివుడు (కాలగళుడు – నల్లని కంఠం గలవాడు) కాలునిపై (యముడిమీద) లంఘించినట్టూ (కవయు మాడ్కి = కలియబడినట్టూ) మహేంద్రుడిమీదకి వచ్చాడు. పోతనలాగే శివుడి భక్తుడైన సింగయ గారు వాడినది, అద్భుతమైన అలంకారం కదా? వచ్చేనెలలో మరోసారి దేవతల రాక్షసుల యుద్ధం, అందులో వృత్రాసురిడి అసలు రూపం బయటకి రావడం చూస్తాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS